సాక్షి జగిత్యాల
గురువారం । 18 । మే । 2023



గంగమ్మతల్లి బోనాలు

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్‌లో గంగమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు పూజలు చేశారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వేలాది మంది భక్తులు పూజలు చేశారు. వేసవి సెలవుల రద్దీ కొనసాగింది.

గరిష్టం/కనిష్టం
42.9/32.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: నకిలీ విత్తనాల విక్రయాలపై తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ భాస్కర్ కోరారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిలీ విత్తనాల సరఫరా, ఉత్పత్తి, అమ్మకాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ అధికారులతో ప్రత్యేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. నకిలీ విత్తనాల గురించి తెలిస్తే వెంటనే రాజశేఖర్‌రాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, 87126 56807, నాగేశ్వరరావు, సీసీఎస్ సీఐ, 87126 56810, సధాకర్, సీసీఎస్ ఎస్సై, 87125 73691 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం చెప్పాలని ఆయన కోరారు.

మెట్‌పల్లి బంద్ ప్రశాంతం



మూసి ఉన్న దుకాణాలు

మెట్‌పల్లి(కోరుట్ల): జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పట్టణ బంద్ ప్రశాంతంగా ముగిసింది. పెట్రోల్ బంకులు, వైన్స్‌లు, హోటళ్లతోపాటు ఇతర వ్యాపార, వాణిజ్య దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. విచారణ జరపకుండా అనిల్‌ను సస్పెండ్ చేయడం తగదని నాయకులు పేర్కొన్నారు. తక్షణమే సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోహార్ తుక్కారాం, మర్రి భాస్కర్, వేములవాడ రాజ శేఖర్, విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న యాదవులు

మల్లాపూర్(కోరుట్ల): ఎస్సై అనిల్‌పై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం కోరారు. స్థానిక భారతమాత కూడలి వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బస్సులో ఇద్దరు మహిళల మధ్య జరిగిన గొడవపై విచారణ జరపకుండా ఎస్సైని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. దీనిని నిరసిస్తూ గురువారం ఇచ్చిన మల్లాపూర్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గంగరాజం యాదవ్, రాజా గంగరాజం, వంగ అశోక్ యాదవ్, బైరి రవియాదవ్, బజారు శ్రీధర్ యాదవ్, అల్లే వినోద్ యాదవ్, దానవేని మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'సర్కార్ అసమర్థతతోనే కొనుగోళ్లలో జాప్యం'

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి ప్రభుత్వం అసమర్థతే కారణమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట, అనంతారం, తక్కళ్లపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఉప్పరిపేట గంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు సాయం చేస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రైస్‌మిల్లర్లు అదనపు తూకం వేయిస్తూ రైతులను దోపిడీకి గురిచేస్తున్నారని పేర్కొంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు లేఖ రాసినట్లు ఎమ్మెల్సీ చెప్పారు. నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందన్న, ధర రమేశ్‌బాబు, గంగారెడ్డి, సురేశ్, మహిపాల్, బింగి రవి, రజనీకాంత్, జున్ను రాజేందర్, జలేందర్, శేఖర్, గంగారెడ్డి, భూమారెడ్డి, ధర రమేశ్‌బాబు, జంగ లచ్చన్న, రాధాకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

జగిత్యాల: జిల్లాలో పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం జరిగిన పరీక్షకు 3,622 మంది హాజరు కావాల్సి ఉండగా.. 175 మంది గైర్హాజరయ్యారు. జగిత్యాలలో 7, కోరుట్లలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు.

నిర్మానుష్యం



ఎండల తీవ్రతకు జనాలు బయటకు రాక నిర్మానుష్యంగా మారిన జగిత్యాల బైపాస్ రోడ్డు

- సుర్రుమంటున్న సూర్యుడు
- ఉదయం 7గంటలకే ఎండ తీవ్రత
- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లని జిల్లావాసులు
- కార్మికులు, శ్రామికుల పరిస్థితి వర్ణనాతీతం
- జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే..
- వైద్యులు, శాస్త్రవేత్తల సూచనలు

జగిత్యాల: నాలుగైదు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలే కాదు.. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 35–37 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవడంతో వేడి తీవ్రత పెరుగుతోంది. గాలిలో తేమశాతం తగ్గుతుండడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 7గంటలు దాటితే ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు జిల్లావాసులు జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప చాలామంది రోడ్లపైకి రావడంలేదు. ఉపాధిహామీ కూలీలు ఉదయం 11గంటల్లోనే పనులు ముగించుకుని ఇంటిదారిపడుతున్నారు. కార్మికులు, శ్రామికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ రంగాల్లోని కార్మికులు, ఇతర అసంఘిత రంగాల్లోని శ్రమజీవులు ఎండలోనే విలవిల్లాడుతూ పనులు చేసుకుంటున్నారు. ఇట్లాంటి పరిస్థితుల్లో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ విభాగాల వైద్యులు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. వీటిని కచ్చితంగా పాటించాలని కోరుతున్నారు.



జగిత్యాల కొత్తబస్టాండ్ సమీపంలో

వేడి ఆహార పదార్థాలు తీసుకోవద్దు

డీఎంహెచ్‌వో శ్రీధర్



జగిత్యాల: వరుసగా వర్షాలు కురిసి మళ్లీ ఎండలు మొదలు కావడంతో మండిపోతున్నాయి. జగిత్యాల జిల్లాలో కొద్దిరోజులుగా 44–46 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం కాస్త తగ్గినా (గరిష్ఠంగా 42.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.) ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే, తప్పని పరిస్థితుల్లో ఎండలో వెళ్లాల్సి వస్తే తీసుకునే జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి శ్రీధర్ పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన మాటల్లోనే..

సాక్షి : పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో బయటకు వెళ్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో : ఎండతీవ్రంగా ఉంటే బయటకు వెళ్లరాదు. ఆటలు ఆడరాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ, తలపాగా ధరించాలి.

సాక్షి : వడదెబ్బకు గురైతే ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో : వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. కొబ్బరినీరు, గ్లూకోజ్, చల్ల, ఓఆర్‌ఎస్ తాగించాలి.

సాక్షి : వడదెబ్బకు ఎలా గురవుతారు. లక్షణాలు ఏమిటి?

డీఎంహెచ్‌వో : తీవ్రమైన వడగాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. వడదెబ్బకు గురైతే నాడీ వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిని కోల్పోవడం, తీవ్రమైన తలనొప్పితో అపస్మారక స్థితిలోకి చేరుకుంటారు.

సాక్షి : ఇంకా ఎలాంటి మార్పులు ఉంటాయి?

డీఎంహెచ్‌వో : శరీరం ఎక్కువసేపు వేడిగా ఉంటుంది. సోడియం క్లోరైడ్, నీటి నిష్పత్తి తగ్గిపోతుంది. అధిక ఉష్ణోగ్రతల ప్రదేశాల్లో పనిచేస్తే.. గంటకోసారి కనీసం 4 లీటర్ల నీటిని చెమట రూపంలో కోల్పోతారు.

సాక్షి : ఎవరు వడదెబ్బకు గురవుతారు?

డీఎంహెచ్‌వో : 65ఏళ్ల వయసు పైబడిన వారు బయటకు వెళ్లరాదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంట్లోనే ఉండాలి. వీరితో పాటు గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పసి పిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్న వారు, గుండెజబ్బులు, బీపీ ఉన్న వారు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.

సాక్షి : జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకుంటుందా?

డీఎంహెచ్‌వో : ఎక్కువ సమయం చల్లని ప్రదేశాల్లో ఉండాలి. ప్రతీఆరోగ్య కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం.

సాక్షి : వడదెబ్బకు గురైతే ఇంట్లో చికిత్స చేయొచ్చా?

డీఎంహెచ్‌వో : తప్పకుండా ఆస్పత్రికే తీసుకెళ్లాలి.

సాక్షి : ఎండలో వెళ్లాల్సి వస్తే ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో : వేడిగా ఉండే ఆహార పదార్థాలు తినకూడదు. కూల్‌డ్రింక్స్ అసలే తాగవద్దు. చల్లగా ఉంటాయని ఎక్కువ మంది కూల్‌డ్రింక్స్ తీసుకుంటారు. ఇవి ప్రమాదకరం. మజ్జిగ, కొబ్బరినీరు మాత్రమే తీసుకోవాలి.

తాగునీరు అందిస్తూ పక్షులను కాపాడాలి

ధర్మపురి మండల పశువైద్యాధికారి రాజేందర్‌రెడ్డి



జగిత్యాలఅగ్రికల్చర్: పెరుగుతు ఉష్ణోగ్రతలతో జంతువులు, పక్షులు అల్లాడిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో అడవుల్లో ఉండే పక్షులు, జంతువులకు తాగేందుకు నీరు లభించడంలేదు. లేదు. ఈ నేపథ్యంలో వాటి సంరక్షణపై ధర్మపురి మండల పశువైద్యాధికారి రాజేందర్‌రెడ్డి పలు సూచనలు చేశారు.

సాక్షి : వీధికుక్కలు, పెంపుడు కుక్కల సంరక్షణ ఎలా ఉండాలి?

పశువైద్యాధికారి : ఏ జంతువుకైనా వేసవిలో నీరు దొరకకపోతే అల్లాడిపోతుంది. కాలనీలు, గ్రామాల్లో వీలైనన్నిచోట్ల నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి. వాటిలో నీరు నింపి రెండు గంటలకోసారి మార్చాలి.

సాక్షి : పక్షులను ఎలా సంరక్షించాలి?

పశువైద్యాధికారి : వడగాలుల తీవ్రత పక్షులకుపై అధికంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పక్షులు ఆహారవేట కొనసాగిస్తాయి. కాబట్టి ఇళ్ల దాబాలపై, చెట్ల సమీపంలో తిండిగింజలు పోయాలి.

సాక్షి : పెంపుడు కుక్కలకు ఎలాంటి ఆహారం అందించాలి?

పశువైద్యాధికారి : మనిషికి అనుకూలమైన సాధారణ స్థితికి పెంపుడు కుక్కలు అలవాటుపడతాయి. వీటికి ప్రొటీన్లు, విటమిన్లు, మాంసకృతులు ఉండే ఆహారం అందించాలి. చల్లని నీటిని అందించాలి. రోజూ చల్లని నీటితో స్నానం చేయించడం మంచిది.

గరిష్ట ఉష్ణోగ్రతలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగైదు రోజులుగా గరిష్టస్థాయిలోనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు వడగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 42.9 డిగ్రీల సెల్సియస్‌గా ఉండగా, కనిష్ట ఉష్ణోగ్రతలు 32.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. బుధవారం నాటి ఉష్ణోగ్రతలు..

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
సారంగాపూర్	సారంగాపూర్	42.9
ధర్మపురి	బుద్దేశ్‌పల్లి	42.8
ఎండపల్లి	ఎండపల్లి	42.6
రాయికల్	రాయికల్	42.5
ధర్మపురి	జైనా	42.5
మల్లాపూర్	మల్లాపూర్	42.5
బీర్‌పూర్	కొల్వాయి	42.5
వెల్గటూర్	గుల్లకోట	42.4
ధర్మపురి	నేరెళ్ల	42.3
జగిత్యాల అర్బన్	జగిత్యాల అర్బన్	42.3
జగిత్యాలరూరల్	పొలాస	42.0



జనాల సందడి లేని జగిత్యాల టవర్‌సర్కిల్

గర్భిణులు నీళ్లు ఎక్కువ తాగాలి



ఒద్నాల రజిత

జగిత్యాల: ఉష్ణోగ్రతలు 44–46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్న దృష్ట్యా గర్భిణులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ రజిత సూచించారు. ఎండలకు బయటకు వెళ్తే రిటర్న్ డెలివరీ అయ్యే అవకాశం ఉందన్నారు. నొప్పులు త్వరగా వస్తాయని అన్నారు. అత్యధికంగా నీరు తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు. ఎండలకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లకూడదని అన్నారు. శిశువులు, చిన్నారులు కూడా చల్లటి వాతావరణంలోనే, నీడకే ఉండాలని చెప్పారు. వీరికి డీహైడ్రేషన్ త్వరగా అయ్యే అవకాశం ఉందని, అందకే ఎప్పుడూ పాలు ఇస్తూనే ఉండాలని అన్నారు. గర్భిణులు ఎక్కువగా వాటర్ ఉన్న ఆహారం తీసుకోవాలని, వాటర్‌మిలన్, మస్క్‌మిలన్ లాంటి పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. వీటి వడదెబ్బ నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

వారం రోజులుగా ఇలా..

తేదీ	గరిష్టం	కనిష్టం
11	44.3	33.2
12	44.5	32.6
13	44.6	34.3
14	44.8	36.2
15	44.5	35.6
16	44.5	35.8
17	42.9	32.6

వాహనదారులు జాగ్రత్త..

జగిత్యాలరూరల్: వేసవిలో వాహనాలు జాగ్రత్తగా నడిపించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సూచించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ట్యాంక్ నిండా పెట్రోల్ ఉంచవద్దని చెప్పారు. ఎండలో పార్కింగ్ చేయవద్దని సూచించారు. అతివేగంగా వాహనం నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఇతర భారీ వాహనాలు కూడా పార్కింగ్ చేసే సమయంలో నీడ ఉన్న ప్రాంతాలను ఎంచుకోవాలని సూచించారు. అధిక సంఖ్యలో వాహనాలను ఒకేచోట పార్కింగ్ చేయొద్దన్నారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ముంపు గ్రామాల సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లో ముంపు గ్రామాలపై బుధవారం సమీక్షించారు. రాంనూర్, తాళ్లకొత్తపేట, చెగ్యాం, కోటిలింగాల, ముక్కట్రావ్‌పేటలో ఇళ్లు కోల్పోయిన 135 కుటుంబాలకు పరిహారం అందించాలని అన్నారు. ఆబాది భూమికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముక్కట్రావ్‌పేటలో సుమారు 36 ఎకరాల అసైన్డ్ భూములకు పరిహారం అందించడంపై వివరించారు. అదనపు కలెక్టర్ లత, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రఫీ, జగిత్యాల, పెద్దపల్లి ఆర్డీవోలు మాధురి, వెంకటమాదవరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జీవనశైలి మార్పులతో పర్యావరణ పరిరక్షణ

జీవనశైలి మార్పులతో పర్యావరణం పరిరక్షించవచ్చని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ బోర్డు సహాయ సైంటిస్ట్ కనక జ్యోతితో కలిసి మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లడారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

జగిత్యాలరూరల్: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. బుధవారం స్థానిక వివేకానంద మినీస్టేడియంలో సీఎం కప్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఇందుకోసం క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని చెప్పారు. క్రీడలతో స్నేహభావంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని అన్నారు. మానసికంగా ఉల్లాసంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాంచందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజరాణి, ఎంఈవో గాయత్రి, ప్రత్యేకాధికారి రాజేశ్వర్, ట్రాఫిక్ ఎస్సై రాము, సర్పంచులు నారాయణ, చెరుకు జాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

బహుమతుల పంపిణీపై వివాదం

జగిత్యాల రూరల్ మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విన్నర్ జట్టు తక్కళ్లపల్లి కాగా, రన్నర్ జట్టుగా లక్ష్మీపూర్‌ను ప్రకటించారు. కానీ బహుమతుల ప్రదానంలో లక్ష్మీపూర్ జట్టుకు విన్నర్ కప్ ఇవ్వడంతో తక్కళ్లపల్లికి చెందిన వాలీబాల్ విజేతలు అదనపు కలెక్టర్ మకరంద్ ముందే ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని సముదాయించడంతో శాంతించారు.

జాతీయస్థాయిలో ప్రతిభ



స్వప్నిక

ధర్మపురి: పట్టణానికి చెందిన విరంజి స్వప్నిక జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వెండి పతకం సాధించింది. రంగు వెంకటరమణ– శ్రీలత దంపతుల కూతురు విరంజిస్వప్నిక ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన జూనియర్స్ పవర్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపింది. ఈమేరకు ఆమెకు పతకం లభించింది. స్వప్నికను పలువురు అభినందించారు.

నేడు బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల: బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న జిల్లాస్థాయి బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, వేణుగోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు సూర్యాపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల బాల, బాలికలు పుట్టిన తేదీ, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, జిరాక్స్, ఒరిజినల్స్‌తో హాజరు కావాలన్నారు.

నిలిచిన మక్కల కొనుగోలు

హమాలీల సమ్మెనే కారణం



కొనుగోలు కేంద్రంలో మక్కల కుప్పలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండల కేంద్రంలోని సింగిల్‌విండో ఈనెల ఒకటో తేదీన ప్రారంభించిన మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు నిలిచిపోయాయి. తొలిరోజు 500 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేసి గోదాముకు తరలించారు. ఆ తర్వాత మరో 900 క్వింటాళ్లు సేకరించగా.. తమకు కూలి రేట్లు గిట్టుబాటు కావడంలేదని హమాలీలు సమ్మెకు దిగారు. దీంతో కొద్దిరోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం సుమారు 20వేల క్వింటాళ్ల మక్కలు కొనుగోలు కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నా.. కొనుగోళ్లు సాగడంలేదు.

ఎకరాకు 26 క్వింటాళ్లే సేకరణ..

రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా.. మార్క్‌ఫెడ్ ఒక రైతు నుంచి ఎకరాకు 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామంటోంది. ఒక్కో ఎకరాకు 35 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. 26 క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని, మిగతా మక్కల్ని ఏం చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

హమాలీల సమ్మెతో నిలిపివేత



గోదాముల్లోని హమాలీలు సమ్మె చేస్తున్నారు. మక్కలను లారీల్లో అక్కడకు పంపిస్తే అన్‌లోడ్ చేయడంలేదు. లారీలు మళ్లీ రాక మక్కల కొనుగోళ్లు నిలిపివేశాం. అవి వస్తే కొనుగోలు చేస్తాం.
– బద్దం గోపి, సింగిల్‌విండో చైర్మన్

15 రోజులుగా కొంటలేరు



రెండు ట్రాక్టర్ల నిండ మక్కలను 15రోజుల కింద కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. తేమకూడా మంచిగానే వచ్చింది. కొనుగోళ్లు చేస్త లేరు. కుప్పల కాడ ఎండలోనే ఉంటున్నం. – లోలపు శ్రీనివాస్, రైతు

సమస్య పరిష్కరించాం



గోదాముల్లో మక్కలను అన్‌లోడ్ చేసేందుకు కూలిరేట్లు పెంచాలని హమాలీలు సమ్మె చేస్తున్నారు. వారితో మాట్లాడి సమస్య పరిష్కరించాం. తక్షణమే మక్కల కొనుగోళ్లు వేగవంతం చేస్తాం. – దివ్యభారతి, డీఎం, మార్క్‌ఫెడ్

క్లుప్తంగా

21న ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

కరీంనగర్: తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోర్సు–1 బ్యాచ్–2023 పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతానియల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జగిత్యాల రోడ్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ఈ నెల17 నుంచి www.tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

- జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఘటన



జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బుధవారం ఓ వృద్ధురాలు మృతిచెందినట్లు ప్రయాణికులు గుర్తించారు. మృతురాలి వయసు 75 ఏళ్ల వరకు ఉంటుంది. ఆమె మృతికి ఎండ తీవ్రతనా లేక అనారోగ్యమా అన్న కారణాలు తెలియలేదు. మృతురాలి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని, ఒంటిపై వంకాయ రంగ బ్లౌజ్, కనకాంబరం రంగుతో చుక్కల చీర ధరించిందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఆమె మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 99493 04574, 94407 00039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం



అజయ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామానికి చెందిన మారమల్ల అజయ్‌కుమార్(19) వీణవంక మండల కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఎంజీఎంలో వైద్యం చేయించారు. అయినా అతను తాగడం మానలేదు. దీంతో అనారోగ్యం నుంచి కోలుకోకుండా మనస్తాపానికి గురై, బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మద్దికుంటకు చెందిన దుమాల మధుపై అదే గ్రామానికి చెందిన సూత్రం కరుణాకర్ మంగళవారం రాత్రి కత్తితో దాడి చేశాడని ఏఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ ఘటనలో మధుకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకొనే కరుణాకర్ దాడి చేశాడని చెప్పారు. బాధితుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించామని, అతని ఫిర్యాదు మేరకు కరుణాకర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉనికి కోసం హత్యలు

- ప్రత్యర్థులను భయపెట్టడమే లక్ష్యం
- మిత్రులైనా, బంధువులైనా లెక్కలేదు
- ఎంతకైనా తెగిస్తున్న నేరస్తులు
- మారుతున్న మైండ్ సెట్



హత్య స్థలంలో విచారణ జరుపుతున్న పోలీసులు

అక్రమ చిట్టీ వ్యాపారం, అధిక వడ్డీలకు అప్పుల వ్యవహారం వివాదాలకు దారితీస్తున్నాయి. ఈక్రమంలోనే కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన యువకుడు మెట్‌పల్లి మండలంలో సోమవారం హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హతుడు, హంతకుడు ఇద్దరూ మిత్రులే కావడం విశేషం.

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో నేరాల తీరు మారుతోంది.. ప్రత్యర్థులను లేదా ఎదుటి వారిని భయపెట్టి, తమ ఉనికి చాటుకునేందుకే చిన్నపాటి గొడవలకే హత్యలకు పాల్పడుతున్నారు.. ఇటీవల జిల్లాలోని కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన యువకుడు మెట్‌పల్లి మండలంలో ఈకోవలోనే హత్యకు గురవడం కలకలం రేపుతోంది.

జోరుగా చిట్టీల దందా..

- జిల్లాలో అనుమతి లేకుండా చిట్టీల దందా జోరుగా సాగుతోంది. కథలాపూర్ మండలం అంబారిపేటలో ఇది మరింత అధికంగా ఉంది.
- గ్రామానికి చెందిన బోయిని రాజేశ్వర్ స్థానికంగా హోటల్ నిర్వహిస్తూ చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు.
- సోమవారం హత్యకు గురైన కాసోజి సంతోష్(27) గ్రామంలోనే వడ్రంగి పనిచేస్తూ జీవిస్తున్నాడు.
- ఓ గ్రూప్ చిట్టీలో కాసోజి సంతోష్ ముందస్తుగా డబ్బులు తీసుకోగా బోయిని రాజేశ్వర్ జమనాత్‌గా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.
- కాసోజి సంతోష్ ప్రతినెలా చిట్టీ డబ్బులు చెల్లించకపోవడంతో జమనాత్‌గా ఉన్న బోయిని రాజేశ్వర్ తానే ఆ సొమ్ము చెల్లించాడు.
- చిట్టీ డబ్బుల గురించి సంతోష్‌ను ఎన్నిసార్లు అడిగిన పట్టించుకోలేదు.
- ఇదే విషయంపై ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి.
- ఈ క్రమంలో సోమవారం ఉదయం కాసోజి సంతోష్ బంధువు మూడురోజుల దినకర్మ కోసం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లికి బైక్‌పై వెళ్లాడు.
- అయితే, మార్గమధ్యంలో బోయిని రాజేశ్వర్ అదే బైక్‌పై ఎక్కాడు.
- మెట్‌పల్లి శివారులో ఇద్దరూ మద్యం తాగారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. కోపంతో కాసోజి సంతోష్ హత్యకు దారితీసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

జోరుగా చిట్టీల వ్యాపారం..

బోయిని రాజేశం అంబారిపేట గ్రామానికి చెందిన ఓ మహిళతో కలిసి కొన్నేళ్లుగా పలు గ్రూపుల చిట్టీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రూప్ చిట్టీలో సభ్యులుగా ఉన్నవారు ఎక్కువగా గల్ఫ్‌లో ఉంటున్నవారి కుటుంబసభ్యులు, నిరక్షరాస్యులే. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని చిట్టీ డబ్బులకు వేలం పాట నిర్వహించి అధిక వడ్డీ చెల్లించినవారికే డబ్బులు ఇచ్చిన సంఘటనలున్నాయని పలువురు బాధితులు తెలిపారు. చిట్టీల గడువు ముగిసినప్పటికీ గ్రూప్ సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకోగా పలువురు విసిగిపోయి నాలుగు నెలల క్రితం సదరు మహిళను నిలదీశారు. ఈ ఏడాది మార్చి 29న ఇప్పపెల్లి గ్రామానికి చెందిన మహిళ చిట్టీ గడువు ముగిశాక రావాల్సిన డబ్బులు రూ.3.50 లక్షలు చెల్లించాలని అంబారిపేట గ్రామంలోని చిట్టీ నిర్వాహకురాలి ఇంటికి వెళ్లి నిలదీసి విసిగిపోయి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం ఠాణా వరకు చేరింది. గత నెలలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహిస్తే.. కొన్ని డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. ఐదు నెలల క్రితం ఓ సర్పంచ్‌తో చిట్టీ డబ్బుల విషయంలో బోయిని రాజేశ్వర్‌కు వివాదం నెలకొనగా ఠాణాకు చేరింది. ఇద్దరినీ పోలీసులు సముదాయించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. చిట్టీ నిర్వాహకురాలితో బోయిని రాజేశ్వర్‌కు డబ్బుల విషయంలో తేడా రావడంతో ఇటీవల వివాదం జరిగినట్లు స్థానికులు అంటున్నారు. ఎవరు ఏ గ్రూప్ చిట్టీ నిర్వహించాలి? ఎంత డబ్బు చెల్లించాలనే విషయంపై పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

ఉనికి కోసమే హత్య చేశారా?

- అంబారిపేటలో ఓ మహిళ భాగస్వామ్యంతో బోయిని రాజేశ్వర్ అక్రమ చిట్టీ వ్యాపారం కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు.
- ఇటీవలే చిట్టీ డబ్బుల్లో తేడా రావడం, మహిళతో వివాదం జరగడం, గ్రూప్ చిట్టీలకు సంబంధించినవి బోయిని రాజేశ్వర్ సుమారు రూ.30 లక్షల వరకు అప్పు ఉన్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.
- సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు హతుడు కాసోజి సంతోష్ చిట్టీ డబ్బులు రాజేశ్వర్‌కు చెల్లించాల్సి ఉంది.
- కొన్ని డబ్బుల కోసం హత్య చేయకపోవచ్చని, పెద్దమొత్తంలో డబ్బులు అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి చేయకుండా వారిని భయభ్రాంతులకు గురిచేయడానికి మిత్రుడైన కాసోజి సంతోష్‌ను రాజేశ్వర్ హత్య చేసినట్లు స్థానికులు, అప్పులు ఇచ్చినవారు చర్చించుకోవడం గమనార్హం.
- ఉనికి కోసమే హత్య చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

అక్రమ చిట్టీపై కఠిన చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా చిట్టీ వ్యాపారం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో అక్రమంగా చిట్టీ వ్యాపారం చేస్తున్నవారి వివరాలు సేకరిస్తాం. బాధ్యులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, సీఐ, కోరుట్ల

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- రాఘవపేట వద్ద ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు



సంఘటన స్థలంలో షేక్ అప్సర్ మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ అప్సర్(34) బుధవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ వెళ్లి, తిరిగి వస్తున్నాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల సాయిలు బైక్‌పై మెట్‌పల్లి వెళ్లి తిరిగివస్తుండగా రాఘవపేట పెట్రోల్ బంక్ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ అప్సర్ తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ముంతాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కలబోని శ్రీనివాస్(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కూలీ పని చేసేవాడు. ఇతనికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అప్పు చేసి, కూతురు పెళ్లి జరిపించాడు. అప్పు తీర్చలేక, వడ్డీ చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు కట్టపై క్రిమిసంహారక మందు తాగాడు. తర్వాత ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వారు వెంటనే అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తొలుత కరీంనగర్, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్?’


జగిత్యాల: జిల్లాలో ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు పర్యవేక్షకులుగా సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులను మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు రిలీవ్ చేశారు. దీంతో వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటలకు సదరు పరీక్ష కేంద్రాల్లో రిపోర్ట్ సైతం చేశారు. కానీ వీరిలో కొందరు టీచర్లు అటు ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు, ఇటు పాఠశాలలకు వెళ్లలేదు.

అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు..

ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు వెళ్లిన టీచర్లు తిరిగి పాఠశాలల్లో జాయిన్ అయ్యే సమయంలో హెచ్‌ఎంలకు, హెచ్‌ఎంలే అయితే ఎంఈవోలకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుంది. కానీ అవి అందజేయకుండానే ఉపాధ్యాయులు తమ విధుల్లో చేరారు. 15 రోజులకు సంబంధించిన జీతం సైతం తీసుకున్నారు. ‘సాక్షి’ దినపత్రికలో ‘ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో సంబంధిత ఎంఈవో ఈ నెల 15వ తేదీలోపు డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని వారిని ఆదేశించారు. దీంతో కొందరు అందజేశారు. వీరిలో పర్యవేక్షకులుగా పనిచేయనప్పటికీ ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి, ఎంఈవోకు అందించినట్లు తెలిసింది. రిలీజ్ ఆర్డర్‌లో ఇంటర్మీడియట్ అధికారులు కంప్యూటర్ షీట్‌లో అబ్సెంట్, ప్రెజెంట్ వేశారు. కానీ కొందరు టీచర్లు వాటిని జిరాక్స్ తీసుకొని, చేతితో అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు. కాగా, మార్చి 15 నుంచి వీరు విధుల్లో చేరుతున్నట్లు ఉండగా డ్యూటీ సర్టిఫికెట్‌లో మాత్రం 10 నుంచే వెళ్లినట్లు పెట్టారు. అలాగే పేర్లను అధికారులు పెన్నుతో రాయగా కొందరు కంప్యూటర్ షీట్‌లో టైప్ చేసుకున్నారు. ఎవరి ఇష్టానుసారంగా వారు డ్యూటీ సర్టిఫికెట్లు తయారు చేసి, అందజేశారు. ఇవి ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్లు అని స్పష్టంగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే నిజానిజాలు బయటపడతాయి. ఈ విషయమై సారంగాపూర్ ఎంఈవో భీమయ్యను వివరణ కోరగా డ్యూటీ సర్టిఫికెట్లు తీసుకొని, డీఈవోకు పంపించామని, ఆయన పరిశీలిస్తారని తెలిపారు.


SRI CHAITHANYA JUNIOR COLLEGE
RELIEVING ORDER

ఒక సర్టిఫికెట్‌లో హ్యాండ్ రైటింగ్..


SRI CHAITANYA JUNIOR COLLEGE

మరో సర్టిఫికెట్ కంప్యూటర్ షీట్‌లో..

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత



యువకులను సన్మానిస్తున్న ఎస్సై సతీశ్

కోరుట్లటౌన్: బంగారం, నగదు ఉన్న బ్యాగు ఇద్దరు యువకులకు దొరికింది.. దాన్ని వారు పోలీసులకు అప్పగించి, నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని ఓ ఫొటో స్టూడియోలో పని చేస్తున్న ఎల్ల సాయి, దామ రాజేశ్‌లకు పాత ఆనంద్ షాపింగ్ మాల్ వద్ద బుధవారం ఉదయం గులాబీ రంగు పర్సు దొరికింది. ఈ విషయాన్ని వారు తమ యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసులకు ఇస్తే, పోగొట్టుకున్నవారికి ఇస్తారని సూచించారు. దీంతో ఆ యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఎస్సై సతీశ్‌కు అందజేశారు. పర్సులో 2 తులాల బంగారు ఆభరణం, 1 తులం బంగారు బిస్కెట్, రూ.1,000 ఉన్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి సంబంధించిన సీసీ ఫుటేజీ పరిశీలించి, బాధితురాలు మెట్‌పల్లి పట్టణానికి చెందిన ధనలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఆధారాలు పరిశీలించి, పర్సు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న యువకులను ఎస్సై అభినందించి, శాలువాలతో సన్మానించారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలి

- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్
- విలాసాగర్‌లో పర్యటన



పల్లె ప్రకృతి వనం పరిశీలించిన జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామాల్లో పచ్చదనం పెంపొందించి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, జీపీ నర్సరీ, కంపోస్ట్ షెడ్లు, అవెన్యూ ప్లాంటేషన్ తదితరాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహణ బాగుందని అభినందించారు. సర్పంచ్ పింగళి రమాదేవి, కరీంనగర్ డీఎల్‌పీవో హరికృష్ణ, హుజూరాబాద్ డివిజనల్ డీఎల్‌పీవో శ్రీలత, ఎంపీడీవో కల్పన, ఎంపీవో సతీశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులున్నారు.

వెల్గొండలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం



బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, ఓ ఇల్లు దగ్ధమైంది. సామగ్రి కాలిబూడిదవగా కుటుంబసభ్యులు నిరాశ్రయులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పెసరి అశోక్, పాండు సోదరులు. వీరి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాలేదు. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ సమీపంలోని రెండు ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అశోక్, పాండు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఫారుఖ్ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. తక్షణసాయంగా బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్ వారిని పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. తన వంతు తక్షణసాయంగా రూ.10 వేలు అందించారు. బాధితులకు ప్రస్తుతం వారి బంధువుల ఇంట్లో ఆశ్రయం కల్పించారు.

జవాన్ అనిల్ కుటుంబానికి ఆర్థికసాయం



బోయినపల్లి(చొప్పదండి): ఇటీవల జమ్మూ–కశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మల్కాపూర్‌కు చెందిన జవాన్ పబ్బాల అనిల్ మృతిచెందిన విషయం విధితమే. బాధిత కుటుంబాన్ని మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అనిల్ భార్య సౌజన్య, తల్లి లక్ష్మిలకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సర్పంచ్‌లు రాజ్యలక్ష్మి, నరేశ్, నాయకులు భాగ్యలత, కిషన్, సత్యనారయణ, రామానుజం, రమేశ్, సతీశ్, రాజేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన బోగు లత (38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లత కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కడుపునొప్పి తీవ్రమవడంతో ఆ బాధ భరించలేక దూలానికి ఉరేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రహదారిపై కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారు జాతీయ రహదారిపై ఓ కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన సుర బక్కయ్య బుధవారం కారులో కోరుట్ల వెళ్తున్నాడు. వెంకటాపూర్ శివారులోకి రాగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో ఆయన కారును ఆపి, దూరంగా పరుగెత్తాడు. చూస్తుండగానే మంటలు వ్యాపించి, వాహనం పూర్తిగా కాలిపోయింది. మెట్‌పల్లి ఫైర్ సిబ్బంది వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఎస్సై సతీశ్ ఘటనాస్థలిని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అనాథ, పేద బాలురకు ఉచిత విద్య

- భోజన వసతితో ఇంగ్లిష్ మీడియం బోధన
- రంగినేని ట్రస్ట్‌లో డిజిటల్ తరగతులు
- ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు

సిరిసిల్ల: పట్టణ శివారులోని రంగినేని ట్రస్ట్‌లో అనాథ, పేద బాలురకు ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్యనందిస్తామని ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు తెలిపారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగినేని ట్రస్ట్‌లో రెండు దశాబ్దాలపాటు అనాథ, పేద విద్యార్థులకు విద్యాబోధన చేశామని, 2020లో కరోనా లాక్‌డౌన్ కారణంగా స్కూల్ బంద్ చేసినట్లు తెలిపారు. 19 మంది పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కు పంపించామన్నారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలురకు భోజన వసతితో ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ తరగతులతో విద్యాబోధన అందించేందుకు ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు నిర్ణయించారని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ తూడి వెంకట్‌రావు మాట్లాడుతూ.. ట్రస్ట్‌లో చదువుకున్న విద్యార్థులు చాలా మంది దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, వివిధ స్థాయిల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్ పర్యవేక్షణలో ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్ నడుపుతామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ట్రస్ట్‌లో అబ్బాయిలను చేర్పించవచ్చన్నారు. ప్రస్తుతం బాలికలను తీసుకోవడం లేదని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్, ప్రముఖ విద్యావేత్త మడుపు ముత్యంరెడ్డి, ఉపాధ్యాయుడు నీలం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఐదిళ్లలో చోరీ



విచారణ జరుపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్, నారాయణస్వామినగర్‌లలోని ఐదిళ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. 10 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ.1.20 లక్షలు ఎత్తుకెళ్లారని ఎస్సై మహేందర్ తెలిపారు. బాధితులు వేగోలపు తిరుపతి, కట్ట రమేశ్, రాజన్న, బొల్లంపల్లి మహేశ్, ఇనుగాల రాజ్‌కుమార్ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇళ్లలో జరిగిన కార్యక్రమాలకు వెళ్లారన్నారు. క్లూస్ టీం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆధారాలు సేకరించారు.